క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలు ఏర్పాటు



శావల్యాపురం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కనమర్లపూడి గ్రామ అధ్యక్షులుగా బోడెపూడి శ్రీనివాసరావును నియమించినట్లు తెలిపారు.

పాఠశాలకు బీరువా వితరణ



వినుకొండ: పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీలోని జెడ్పీ పాఠశాలకు బుర్రిపాలేనికి చెందిన టీచర్ కన్నెబోయిన శ్రీనివాసరావు రూ.10వేలు విలువ చేసే బీరువాను శుక్రవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్.వీరపయ్య మాట్లాడుతూ కొత్తగా హైస్కూల్ ఏర్పడినందున పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు దాతల సహాయ,సహకారాలు అవసరమని తెలిపారు. అనంతరం దాత శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పీడీ రాధాకృష్ణమూర్తి, రాంబాబు, గాయత్రి, చంద్రజిత్‌యాదవ్, బాలకృష్ణ, పద్మజ, ఎలీషా, శాంతకుమారి, గోవిందు, చంద్రశేఖర్, మల్లయ్య, ఎలిజబెత్‌రాణి, రామాంజి, కోటిరత్నం, భ్రమరాంబ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నాను జయప్రదం చేయండి



యడ్లపాడు: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ప్రకటించింది. ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ యడ్లపాడు మండలం లింగారావుపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫ్యాప్టో సభ్యులు సన్నాహక సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి బి సంపత్‌బాబు మాట్లాడుతూ 18 కీలక డిమాండ్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు కేవీ రామిరెడ్డి, బి సుధాకరరావు, పి విజయ్‌సామ్యేల్, ఎస్ వరప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేపై గ్రామ సభలు

రొంపిచర్ల: మండలంలోని అలవాల, అన్నవరం, ఆరేపల్లి, దాసరిపాలెం, గోగులపాడు, మాచవరం, ముత్తనపల్లి, నల్లగార్లపాడు, రొంపిచర్ల, సంతగుడిపాడు, తురిమెళ్ల, విప్పర్లపల్లి, విప్పర్ల గ్రామాల్లో శుక్రవారం స్వమిత్వ సర్వేకు సంబంధించి గ్రామస్తుల్లో అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సభల్లో ఎంపీడీవో మ్యాథ్యూబాబు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సర్పంచ్‌లు, వీఆర్‌వోలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు సేవలు మరువలేనివి



రొంపిచర్ల: గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు చేసిన సేవలు సహచర కార్యదర్శులకు మార్గదర్శకాలని ఎంపీడీవో కె.మ్యాథ్యూబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి గ్రామ పంచాయతీ కార్యదర్శి రావిపాటి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సమావేశానికి గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నాగేశ్వరరావు తన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించారని అన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి గ్రామ కార్యదర్శులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఆయన శేషజీవితం సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిప్పగుడిశ జయమ్మ, మాజీ సర్పంచ్ పల్లెల శివారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అంతులేని కథ..చెప్పలేని వ్యథ

- 25 ఏళ్ల వయస్సులోనే రెండు పెళ్లిళ్లు.. ఐదుగురు ఆడపిల్లలు
- ఇద్దరు భర్తలు వదిలివేయడంతో లేబర్ కార్యాలయం ఆవరణలో జీవనం
- ప్రస్తుతం నిండు గర్భిణి.. కడుపున కవలలు
- పౌష్టికాహారం లోపం రక్తహీనతతో బాధపడుతున్న వైనం
- మూడేళ్ల కుమార్తె బిక్షాటనతోనే సాగుతున్న బతుకు బండి
- ఇదీ మహిళ షేక్ జరీనా దుర్భర స్థితి



వినుకొండ లేబర్ కార్యాయంలో ఇద్దరు పిల్లలతో నిండు గర్భిణి జరీనా

వినుకొండ : ఒక తప్పటడుగు జీవితాన్నే మార్చివేసింది. ఇందుకు మచిలీపట్నానికి చెందిన షేక్ జరీనా జీవితం ఓ ఉదాహరణ. 25 ఏళ్లకే రెండు పెళ్లిళ్లు ఐదుగురు ఆడపిల్లలు. మళ్లీ తొమ్మిది నెలల గర్భిణి. కడుపులో రెండు ప్రాణులు. కులాంతర వివాహంతో ఇంటి నుంచి గెంటి వేసిన పుట్టింటి వారు. భర్తలు ఇద్దరూ వేధింపులకు గురి చేసి వదిలివేయడంతో దీనస్థితిలో పల్నాడు జిల్లా వినుకొండలోని ప్రభుత్వ లేబర్ కార్యాలయంలో తలదాచుకుంటున్న మహిళ షేక్ జరీనా. మూడేళ్ల కుమార్తె భిక్షాటన చేసి తెచ్చిన ఆహారంతోనే బతుకు బండి సాగిస్తుంది. ఈతి బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నం చేసింది. కడుపులో పెరుగుతున్న ప్రాణాలు గుర్తొచ్చి జీవశ్చవంలా బతుకుతోంది. వివరాల్లోకెళితే.... మచిలీపట్నంకు చెందిన షేక్ జరీనా తండ్రి మహమ్మద్ తాపీమేస్త్రి. జరీనా 18 ఏళ్ల వయస్సులోనే కులాంతర వివాహం చేసుకుంది. తన చిన్నమ్మ చెప్పిన మాయ మాటలు నమ్మి అదే టౌన్‌కు చెందిన వెంకటరత్నం అనే బేల్దారీ మేస్త్రిని వివాహం చేసుకుంది. నలుగురు ఆడపిల్లలు భవానీ, చంద్రకళ, అనూ, రమ్య జన్మించారు. భర్త మద్యానికి బానిసగామారి నిత్యం వేధిస్తుండటంతో ఇద్దరూ విడిపోయారు. ముగ్గురు పిల్లలను అనాథ శరణాలయంలో చేర్పించారు. రమ్య అప్పటికి పాలు తాగే చిన్న పిల్ల కావడంతో తన వద్ద ఉంచుకుంది. అప్పటి నుంచి భిక్షాటన చేస్తుంది. మూడేళ్ల కిందట రవి కుమార్ అనే వ్యక్తితో పరిచయం కావడంతో రెండో పెళ్లి చేసుకోగా ఓ పాపకు జన్మనిచ్చింది. ప్రస్తుతం జరినా గర్భిణి. వైద్య పరీక్షకు వెళ్లగా, కవలలు అని చెప్పారు. దీంతో భర్త పుట్టబోయే ఇద్దరు పిల్లలతో కలిపి నలుగురు పిల్లల పోషణ కష్టంగా భావించి నంద్యాలలోని బంధువుల ఇంటికి వెళదామని నమ్మించి రైల్వే స్టేషనులో జరీనాను చంపే ప్రయత్నం చేయగా తప్పించుకుని వినుకొండలోని లేబర్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఆ రోజు నుంచి భర్త ఆచూకీ లేదు.



భిక్షాటన చేసి ఆహారం తీసుకొస్తున్న మూడేళ్ల కుమార్తె

పౌష్టికాహారం లోపం

నెలల తరబడి పౌష్టికాహారం లేక జరీనాకు రక్త హీనత ఏర్పడింది. పాలుతాగే పాపతో పాటు కవలలు పెరుగుతుండడంతో కేవలం 5 శాతమే ఉన్న రక్తంతో కాన్పు కష్టమని డాక్టర్లు తేల్చి చెప్పారు. దీంతో ఎవరూ లేక బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తోంది.

మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించడం హేయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంఎన్ ప్రసాద్
- గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే దాకా పోరాటం ఆగదు
- మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేత



మున్సిపల్ మేనేజరుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వినుకొండ: వినుకొండలో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఎవరికీ చెప్పకుండా తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎంఎస్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడాన్ని నిరసిస్తూ, నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ అధికారులకు వినతిప్రతం అందజేశారు. పట్టణ అధ్యక్షులు కొత్తమాసు శివ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమ్మిరెడ్డి అంజిరెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా లతోపాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ప్రసాదు మాట్లాడుతూ విగ్రహం తొలగింపుపై ప్రశ్నిస్తే మున్సిపల్ కమిషనరు ఆర్యవైశ్య సంఘ నాయకులకు, వాసవీ క్లబ్ సభ్యులకు తెలియజేశామని చెప్పడం సమంజసం కాదన్నారు. మహాత్మాగాంధీ ఒక కులానికి సంబంబధించిన వ్యక్తి కాదని యావత్ భారతదేశం కులాలకు, మతాలకు అతీతంగా ఆరాధించే వ్యక్తి అని గుర్తు చేశారు. మాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. అనంతరం మున్సిపల్ మేనేజరు వెంకట్రామయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్లు గంధం బాలిరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, యాదవ్, కౌన్సిలర్లు సానాల పుల్లయ్య, యారం రామిరెడ్డి, బూత్‌కమిటీ నాయకులు కొత్త కృష్ణారెడ్డి, తుమ్మా వెంకటరెడ్డి, కొత్త వీరాంజనేయరెడ్డి, తలారి ఆంజనేయులు తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌ను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే



జేఎన్‌టీయూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేటరూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు శుక్రవారం సందర్శించారు. కళాశాల భవనాలను పరిశీలించిన అనంతరం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. కళాశాలలో వసతుల గురించి ఆరా తీశారు. యువతీ, యువకుల వసతి గృహాల నిర్మాణం దాదాపు పూర్తయిందని, పెండింగ్ పనులను పూర్తిచేసేందుకు యూనివర్సిటీ అనుమతి రావాల్సి ఉందని తెలిపారు. దాదాపు రూ.10కోట్ల మేర వసతి గృహాలకు రోడ్లు, పెండింగ్ పనుల కోసం నిధులు అవసరమవుతాయని వివరించారు. జేఎన్‌టీయూ వర్సిటీ నుంచి నిధులను తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్, ఎమ్మెల్యే తెలిపారు. ఆర్డీఓ మధులత, జేఎన్‌టీయూ డీఈ కే.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూటమి నేతల హామీలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి



ప్రజలతో క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయిస్తున్న షేక్ దరియావలి

చిలకలూరిపేట: కూటమి నేతల హామీలపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 28వ వార్డులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలో సమావేశం నిర్వహించి, ఇంటింటికీ తిరిగి క్యూఆర్ కోడ్ ప్రజలతో స్కాన్ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలోని కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు చేశారో ప్రజలకు వివరంచాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆనాడు సూపర్ సిక్స్ అంటూ హామీలు ఇవ్వడమే కాకుండా ఇంటింటికీ తిరిగి ఇచ్చిన హామీలు అమలు చేస్తామంటూ ష్యూరిటీ బాండ్ పేపర్లను పంపిణీ చేసి, మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలన్నారు. హామీలు అమలు చేయకుండానే అన్నీ అమలు చేశామని చెప్పుకొని తిరగడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య నున్న మహిళలకు నెలకు రూ. 15వందలు ఇస్తామన్నారని, ఇప్పుడది పీ-4 కు అనుసంధానం చేసి ప్రజలను మాయ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇది ఏ మాత్రం ఆచరణలో సాధ్యమయ్యేది కాదన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఎవరికీ పైసా చెల్లించని విషయాన్ని గుర్తు చేశారు. ఇటువంటి కూటమి నేతల దొంగ హామీల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని ఇటువంటి తరుణంలో ప్రజలను అప్రమత్తం చేసి తిరిగి పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మొలకలూరి బాజిమున్ని, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌ఆలీ, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఏకంబరపు సునీత, నాయకులు సుభాని, సిరాజ్, దరియాహుస్సేన్, సుదర్శనం వెంకయ్య, మొహమ్మద్ యూసుఫ్, రషీద్, తాళ్ల అంజిరెడ్డి, కొండవీటి ఆంజనేయులు, తియ్యగూర అంజిరెడ్డి, ఇర్రి రాఘవ, గోపతోటి జాన్, సాపా సైదావలి, దాసరి అంజలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు



రొంపిచర్ల: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఈవో డి.బ్రహేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాలు నిరోధక కమిటీల ఏర్పాటు, దూర విద్యా విధానంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పాఠశాలల్లో కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదక ద్రవ్యాలు వాడకం వల్ల మత్తుకు బానిసై, విచక్షణ జ్ఞానం కోల్పోతారన్నారు. మాదక ద్రవ్యాలకు విద్యార్థులను దూరంగా ఉండే విధంగా ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అన్నారు. దూరవిద్య ద్వారా పదో తరగతి, ఇంటర్, డిగ్రీ కోర్సులను అభ్యసించవచ్చని అన్నారు. ఈనెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ ఏర్పాటుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీఎం. సుభానీ, ఏఎస్ఐ కిషోర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే జీవితం నాశనం

చిలకలూరిపేట: మాదక ద్రవ్యాల వినియోగం జీవితాలను నాశనం చేస్తుందని ట్రైనీ ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పసుమర్రు ఎంకే జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకసారి వాటికి అలవాటు పడితే బయటపడటం కష్టమని అన్నారు. డ్రగ్స్ కారణంగా సమాజంలో పలు అవాంఛిత సంఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్కూల్ హెచ్ఎం వై హనుమంతరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు గద్దే హరిబాబు, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతిరాత బంగారు భవిష్యత్‌కు పునాది

చేతిరాత నిపుణులు ఉప్పాల రామమోహనరావు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న చేతిరాత నిపుణులు రామమోహనరావు

శావల్యాపురం: చేతిరాత బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు వారి సారథ్యంలో విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ తరగతులతోపాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అందమైన చేతిరాత ద్వారా బంగారు భవితకు పునాది వేసుకోవచ్చని అన్నారు. ఇప్పటి వరకు కాకినాడ, కర్నూలు, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు తదితర ప్రాంతాల్లో 5300 ఉపాధ్యాయుల సారధ్యంలో 65 వేల మంది విద్యార్థుల చేతి రాతలో విప్లవం వచ్చేలా చేశామన్నారు. ఇందులో భాగంగా ఒక్కో ఉపాధ్యాయుడు 10 మంది విద్యార్థులను దత్తత తీసుకొని చేతిరాతలో తర్ఫీదు ఇస్తారన్నారు. అలాగే క్యాలిగ్రాఫీ చరిత్రలో మొదటసారిగా క్యూఆర్ కోడ్ సహాయంతో హ్యాండ్ రైటింగ్‌ని ప్రతి ఒక్కరూ సులభంగా నేర్చుకొనేలా వినూత్న పద్ధతిలో హ్యాండ్ బుక్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పాఠశాల సీనియర్ ఆంగ్ల ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డు విజయలక్ష్మి,, చేతిరాత శిక్షణ నిపుణులు చేపూరి రమేష్, సత్యనారాయణ, టి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై పీ-4 కార్యక్రమాన్ని రుద్దడం సరికాదు

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయులపై పీ-4 కార్యక్రమాన్ని బలవంతంగా రుద్ద రాదని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫ్యాప్టో భాగస్వామ్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యాన నరసరావుపేటలోని గాంధీపార్కు వద్ద శనివారం నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి సన్నాహక సమావేశం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ పూల్ ద్వారా వెంటనే పోస్టింగులు ఇవ్వాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. 30శాతం మధ్యంతర భృతి ప్రకటించటంతోపాటు, రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 3 పెండింగ్ డీఏలను ప్రకటించి, డీఏ బకాయిలను, 11వ పీఆర్సీ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ల సాధన కోసం శనివారం నరసరావుపేటలోని గాంధీ పార్క్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి జయప్రకాష్, మక్బూల్ బాషా, దుర్గాప్రసాద్, జి కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బొంత రవి, షేక్ మస్తాన్‌వలి, చావల మల్లేశ్వరరావు, ఎం శారద పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం

బొల్లాపల్లి: మండలంలో శనివారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతోపాటు, పలువురు పార్టీ నేతలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రీడల్లో సంసిథ్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: క్రీడల ద్వారా మానసిక ధైర్యం, పట్టుదల, శారీరక వికాసం మెరుగుపడతాయని సంసిథ్ స్కూల్ ప్రిన్సిపాల్ సాగర్‌బాబు అన్నారు. శుక్రవారం సంసిథ్ స్కూల్లో క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సాగర్‌బాబు మాట్లాడుతూ కూచనపల్లి గీతాంజలి స్కూల్ (సీబీఎస్ఈ) జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. అండర్ 10 విభాగంలో షారుక్ రజత, అండర్-12 విభాగంలో యశ్వంత్, భవానీ ప్రసాద్‌లు రజత పతకాలు సాధించారన్నారు. అండర్-14 విభాగంలో లక్ష్మీ శృంగేరి కాంస్య పతకం, హంస వర్షిత రజత పతకం, సయ్యద్ హర్షద్ బంగారు పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.నాగరాజు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

46 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు పంపిణీ

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 46 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఎ-సర్టిఫికెట్ ప్రదానోత్సవం నిర్వహించారు. 25-ఆంధ్రా బెటాలియన్ మేజర్ రాంసింగ్, హవాల్దార్ ఈశ్వర్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి మహమ్మద్ రసూల్, హెచ్ఎం ఐ కృష్ణానాయక్ హాజరై 46 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హెచ్ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ఎ-సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యలో రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు.

సంక్షిప్త వార్తలు

■ శ్రావణ శుక్రవారం పూజలు



నరసరావుపేట ఈస్ట్: శ్రావణమాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని పట్టణంలో పలు ఆలయాలలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బరంపేటలోని శ్రీ లీలా వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధర్మకర్త కె.పి.రంగారావు, రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో మహిళలు కుంకుమపూజలో పాల్గొని శ్రీపద్మావతి అమ్మవారికి సారె సమర్పించారు. తొలుత అష్టలక్ష్మి అమ్మవార్ల ప్రతిమలతో నగరోత్సవం నిర్వహించారు. ఎన్జీఓ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

■ 6512 మందికి అన్నదాత సుఖీభవ

శావల్యాపురం: అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ పథకానికి సంబంధించి 6512 మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలానికి రూ.4 కోట్ల 56 లక్షలు మంజూరు చేసిందన్నారు. అర్హత కల్గియున్న రైతు బ్యాంకు ఖాతాలో నగదు ప్రభుత్వం శనివారం జమ చేయనున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో బీపీటీ రకం 5204, కేఎన్ఎం 1638 వరి విత్తనాలు రాయితీపై రైతులకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బీపీటీ 5204 రకం వరి విత్తనాలు 25 కేజీల సంచి రూ.950 చెల్లించాలన్నారు.

■ బీసీ హాస్టల్‌లో ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమం

నూజెండ్ల: విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకనేందుకు శ్రద్ధ చూపాలని మండల వైద్యాధికారి వహీదా రెహమాన్ అన్నారు. నూజెండ్లలోని బీసీ హాస్టల్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి వహీదా రెహమాన్ మాట్లాడారు. అనంతరం నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

■ ఘనంగా పోలేరమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ తల్లి దేవాలయం ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రాలు, మేళతాళాలు నడుమ సంబరాలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను నూతన వస్త్రాలు, పూలదండలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జనసేన నాయకులు నాగశ్రీనురాయల్ తదితరులు పాల్గొన్నారు. భారీ అన్నదాన సంతర్పణ చేశారు.

■ పేట ఇన్‌చార్జి డీఎస్పీగా వెంకట రమణ



నరసరావుపేటటౌన్: నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీగా ఎం.వెంకటరమణను నియమించారు. ఇప్పటి వరకు నరసరావుపేట డీఎస్పీగా పనిచేసిన కె. నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ పొందిన విషయం విదితమే. ఆయన స్థానంలో ప్రభుత్వం ఎవ్వరినీ నియమించలేదు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకట రమణను ఇన్‌చార్జి డీఎస్పీగా నియమిస్తూ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

■ 199 మందికి నూతనవితంతు పెన్షన్లు

నాదెండ్ల: పెన్షన్ తీసుకునే భర్త చనిపోతే తదుపరి నెలలో తప్పనిసరిగా భార్య పెన్షన్ పొందవచ్చని ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. నాదెండ్ల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌టీఆర్ భరోసా వితంతు పెన్షన్లను పంపిణీ చేశారు. మండల పరిధిలో 199 మంది కాగా, ఒక్క నాదెండ్ల గ్రామంలోనే 35 మందికి అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

శిశువు ఆరోగ్యానికి తల్లి పాలే కీలకం



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చిలకలూరిపేట టౌన్: తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి కీలకమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దార్ల బుజ్జిబాబు అన్నారు. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(గార్డ్స్) ఆధ్వర్యంలో తూర్పు మాలపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి గార్డ్స్ అధ్యక్షురాలు దాసరి ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, హనుమాయమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం తల్లిపాల విశిష్టతపై ఐసీడీఎస్ ముద్రించిన గోడపత్రికలను ఆవిష్కరించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శివకుమారి, గార్డ్స్ కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

శావల్యాపురం: తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత అన్నారు. శుక్రవారం శావల్యాపురంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పి.సుగుణ, ఆరోగ్య కార్యకర్త శ్రీలలిత, ఆరోగ్య ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు ఆరోగ్యకరం

నాదెండ్ల: తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యమని, వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి జ్ఞానేశ్వరి చెప్పారు. నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీవో జి శాంతకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సాయిశ్వేత, కమలకుమారి, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



నరసరావుపేటరూరల్: ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం పెట్లూరివారిపాలెంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని క్యాన్సర్ కారణాలు, లక్షణాలు, నివారణ మార్గాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదకరమైన వ్యాధి అయినప్పటికి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. పొగ తాగడం, కాలుష్యం, జీవనశైలిలో మార్పులు వంటి అంశాలు క్యాన్సర్‌కు దారితీస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్‌భూషణ్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.అశోక్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.